
# కన్నీ నీకే నేల చాలు



కె. గణపతి రావు

నిన్నటి విషాద నిట్టూరుస్తూ నిష్క్రమణగా జారుకుంటున్న వేళలో—

ప్రభాతం ప్రసవ వేదనతో ప్రపంచానికి వెలుగు నిస్తున్న తరుణంలో. . .

తేలు కుట్టిన దొంగలా తల వంచుకుని నిలబడ్డ భానుడు పుస్తె అమ్మి పిల్లల సన్నులు తీర్చిన తండ్రిలా తూలుకుంటూ నడుస్తున్న భాస్కరం వేపు బాధగా చూశాడు.

అవును. భాస్కరం భారంగా అడుగులు వేస్తున్నాడు.

మోయలేని భారంతో బతుకు నీడుస్తున్న భాస్కరం భుజంపై ఉన్న నాలుగేళ్ళ 'నానీ'నికూడా మోయటానికి ఓపిక లేనట్టుగా ముందుకు కదిలిపోతున్నాడు.

భుజం మార్చుకుంటే 'నానీ' నిద్ర లేస్తాడన్నట్టుగా, నిద్ర లేస్తే కల చెదిరి 'నాన్నా! నన్నెందుక్కన్నావ'ని నిలదీస్తాడన్నట్టుగా నెమ్మది నెమ్మదిగా సాగిపోతున్నాడు.

అలసట వచ్చినప్పుడు ఆగిపోతున్నాడు.

ఆగి ఆగి సాగిపోతూ సాగిపోతూ ఆగుతున్నాడు.

ఆగిపోయి ఆయాసంతో ఆలోచిస్తున్నాడు.

"నా చిట్టికొండ ఎంత ముద్దొస్తున్నాడో చూశారా?"

"అవును."

"అమ్మో దృష్టి తగిలేను."

బోసి నవ్వుల బాబు తొలిసారి బుడి బుడి అడుగులు వేసినప్పుడు తన్మయత్వంతో తేలిపోయిన తల్లి కళ్ళల్లో కోటి 'కాండిల్సు' కాంతి.

కన్నీళ్ళలో ఎన్నో కలలు కలవరింతలు.

ఎదుగుతున్న 'నానీ' రువ్వే నవ్వులు. పువ్వులు.

గతుకుల జీవన పథంలో పూల రథం. నానీ

ఒడుదుడుకుల తూగు టుయ్యాలలో చిట్టి నేస్తం—నానీ.

సుడిగుండాల జీవన స్రవంతిలో నవ్వుల నావ నానీ.

"ఏమండీ! మనం ఎన్ని ఇబ్బందుల్ని పడ్డా వీడిని మాత్రం బాగా చదివించాలి." అంధకారంలో ఆశాకిరణం లాంటి నానీ కోసం తల్లి పడే తపన.

అవును. తీరని కోరికలతో ప్రేతంలా బతికే గుమాస్తా కాకూడదు. నాలా చస్తూ బతక్కూడదు. గొప్పగా బతికి గొప్పవాడిగా పోవాలి. పోయి నలుగురి లోపలా బతకాలి...లక్షల్లో ఒకడుగా—

"వీడి జాతకం ప్రకారం వీడు చాలా గొప్పవాడవుతాడని చెప్పారండి సిద్ధాంతిగారు." ఆశావాదాన్ని అక్కువ చేర్చుకునే మాతృగర్వం.

కాని గుమాస్తా కొడుకు అంత గొప్పవాడవుతాడన్న సిద్ధాంతం నే నెక్కడా వినలేదు. మరి, బహుశా మన వాడిది ఎక్సెప్షనల్ కేసేమో."

"గొప్ప ఆదర్శవంతు డవుతాడనికూడా చెప్పారు."

వద్దు. ఆదర్శాలు మన కొద్దు. ఆదర్శాల నీడన బతికిన వా డెవడూ నిశ్చింతగా జీవించలేదు.

అభిమానవంతుడు కావాలి.

నాలా అభిమానవంతుడుగా ముక్కుకు సూటిగా సాగిపోవాలి.

కష్టాలను తనలా ఓకోగల ధీమంతుడు కావాలి.

సుఖాలను నలుగురి తోనూ పంచుకోగల మహాత్ముడు కావాలి.

"ఏమండీ! కలెక్టరు అవాలంటే ఎంతవరకూ చదవాలి. . ."

అవును. వీడు ఐ. ఎ. ఎస్. చేస్తే చాలా బాగుంటుంది. సంఘంలో పరపతి, హోదా, తండ్రిగా తనకూ తృప్తి, గుర్తింపు.

అన్నట్టు గవర్నరైతే.

'బోంయ్' మన్న హారన్—గుమాస్తా కొడుకు గవర్న రవడని ఎగతాళి చేస్తున్నట్టుగా.

ఖరీదైన కారు కాలితో నిన్ను నేల రాస్తాననే

కాపిటలిస్ట్ లా చూసింది.

కారులోని డిగ్నిఫైడ్ పర్సనాలిటీ 'డే డ్రీమ్స్ ఆర్డేంజరస్' అన్నట్టుగా నిగ్రహించుకుంది.

బెడ్ సిక్ లాంటి బతుకు ఈడ్చే భాస్కరం బలాన్ని పుంజుకుని పక్కకు జరగబోయాడు.

ఒంట్లో లేని 'కాలరీస్' జీవితమనే గాలరీ లోని ఆఖరి మెట్టు పైకి తోసినట్టుగా తూలి పడబోయి నేలపై మళ్ళీ నిలదొక్కుకున్నాడు.

కమ్మని కలలుకూడా కనే హక్కు లేని గుమాస్తా హైవే మీద. అందంగా సాగిపోతున్న కాడిలాక్ను చూస్తూ త్రుటిలో ప్రమాదం తప్పడం తన 'బాడ్‌లక్' మాత్రమే అనుకున్నాడు.

•

ఈ దారి తమ లాంటి వారికి కాదని తెలుసుకున్న భాస్కరం మరో దారి ఎన్నుకుని ముక్కుకుసూటిగా ముందుకు కదిలాడు.


బ్రిటానియా
పాల బిస్కట్



పెరిగే పాపాయిలకు రుచివంతమైన
తోడు!




రుచికరమైన, పుష్టికరమైన
బ్రిటానియా
మిల్క్ బికీస్

లింటాస్-BBC-MB-3-203 TL

కళ్ళు తిరుగుతున్నాయి.

కాళ్ళు తూలిపోతున్నాయి.

జీవితంలో తొలిసారి రాత్రి తాగిన మందు మైకం ఇంకా తగ్గనట్టుగా, ఆ భావం తప్పుకో లేనట్టుగా ఉంది.

భుజం నొప్పెడుతూంది.

మెడ నొప్పి పెడుతూంది.

చేతుల్లోని నరాలు లాక్కు పోతున్నాయి.

నానీని భుజం మార్చుకో వాలనుకుని మళ్ళీమెలకువ వస్తుందేమో అన్నట్టుగా ఆగిపోయాడు.

అలసట. నీరసం.

ఆగి ఆగి సాగిపోతున్నాడు.

సాగిపోతూ ఆలోచిస్తున్నాడు.

"డాడీ! లోయర్ కేజీలో నేను ఫస్ట్."

కాని నేను మాత్రం జీవితమనే పరుగు పందెంలో ఎప్పుడూ లాస్టే నాన్నా.. ఐ లాస్ట్ మై లైఫ్లాంగ్.

"నేను బాగా చదువుకుంటా."

తప్పకుండా నాన్నా. లేకపోతే నువ్వు గొప్పవాడి వెలా అవుతావు!

"డాడీ. మరేమో. నేను డాక్టరు నవుతా. అప్పుడైతే అమ్మ జబ్బు నయం చేసేస్తా."

పిచ్చి నాన్నా! అమ్మ జబ్బు మందులకు తగ్గేది కాదురా. అదీ పేదరికమనే జబ్బు. సగటు జీవుల నేస్తం. ఆ జబ్బు నయం కావాలంటే చావు రావాలి. అదికూడా అంత తొందరగా రాదు. ఎందుకంటే మనసునీ శరీరాన్ని కొంచెం కొంచెంగా తినే మృత్యువు కొన్నాళ్ళకో కొన్నేళ్ళకో కాని మనల్ని తీసుకు పోదు. అంతవరకు జీవచ్ఛవంలా బతకాలి అమ్మ. అది మనకు శాపం చిట్టీ. అదంతే. ఆ.

"మరి అమ్మ రోజూ దేవుడికి దణ్ణం పెడుతుందిగా. అమ్మ జబ్బెందుకు నయం కాదు?"

అలా దేవుడి ద్వారా జబ్బులు నయమైపోతే డాక్టర్లు బికారులైపోతారు. మెడికల్ కాలేజీలన్నీ మూసేస్తారు... ఆసుపత్రుల వ్యాపారం దెబ్బతిని పోతుంది... అనారోగ్యానికి భయపడని అందరూ అన్ని వ్యసనాలకూ లోనైపోతారు. అరాచకం ఎక్కువైపోతుంది... ఆఖరుకి స్మశానాలు కూడా కలవులిచ్చేసిన స్టేట్ గవర్నమెంట్ ఆఫీసుల్లా తయారైపోతాయి... కులవృత్తి పోయిన కాటి కాపర్లంతా కల్లోలాన్ని సృష్టించేస్తారు...అందుకని.

"అమ్మా"... గుండెల్ని కోసే మూలుగుతో అదిరిపడి ఆలోచనల నుండి తేరుకున్న భాస్కరం కొడుకే పిలిచాడేమో అన్నంత ఆశలో ప్రక్కకు చూశాడు.

కానీ నిద్ర పోతున్నట్టుగానే ఉన్నాడు.

రోడ్డువారగా ఆకలితో మెలికలు తిరిగిపోతున్న ముష్టిబాలుడు...

'అంతర్జాతీయ బాలల సంవత్సరం' అని గుర్తు కొచ్చిన భాస్కరం అసంకల్పితంగా జేబులు తడుము కున్నాడు.

అంతకు ముందెప్పటి నుండో ఖాళీగావున్నజేబులు ఆరోజు కూడా అలాగే ఉన్నాయి...

నేటి బాలలే రేపటిపౌరులు...

పసిపాపల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యం...

> వయసులో ఉన్నప్పుడు సుఖానుభూతి కోసం చదువుకునే పుస్తకాలు, వృద్ధాప్యంలో మధుర స్మృతులుగా మిగిలి పోతాయి.
>
> — లే హంట్

ఆలోచిస్తూ నడుస్తున్న భాస్కరం ఒక్కక్షణం ఆగాడు...

ఆగిన భాస్కరం ఒక్క క్షణం నానీ ముఖంలోకి చూశాడు. ...

నానీ వదనంలో నా కింకే చింతా లేదన్న నిశ్చింత...

పాలబుగ్గలు పాలిపోయి....

భాస్కరం కదిలాడు...

కళ్ళనుక నీటికుండా తొణికింది.

"న్యూట్రీషియన్ డైట్ లేక పోవటమే ఇంతటి నీరసానికి కారణం... పిల్లడు చాలా వీక్‌గా ఉన్నాడు."

నానీని చూసిన డాక్టరు ఆరోజు అన్నమాటలు..

కలెక్టరు కావాల్సిన నానీ నీరసంతో మంచం పట్టాడు...

నోటిలోకి నాలుగు వేళ్ళు పోని నాలాంటి వాడికి పుట్టిన నానీకి న్యూట్రీషియన్ ఫుడ్డా?

పెళ్ళి కావలసిన చెల్లి, కాటికి కాళ్ళు చాచు కూర్చున్న తల్లి, అనారోగ్యంతో మంచం పట్టిన భార్య, ఎదుగూ బొదుగూ లేని జీవితం...

కొడుక్కి పాలూ, పళ్ళూ

టానిక్కులు, సిరప్పూ...

చేయిచాచని తన ఆత్మాభిమానమూ...

కష్టాలని, కన్నీళ్ళని తన గుండెల్లోనే జీర్ణించు కునే ఆత్మసంయమనమూ...

నానీ పరిస్థితి విషమించింది.

తెలుగు సినిమాలోని పేద కథానాయకుడి కొచ్చిన పరీక్షలా...

రోజే గడవని తన లాంటి గుమాస్తా జీవితంలో నెలాఖరు రోజు...

రాయి తన్నుకుని తూలి పడబోయిన భాస్కరం ఆలోచనల నుండి తేరుకున్నాడు.

అస్తమిస్తున్న సూర్యుడిలా అలసటగా ఒక చెట్టు కింద చతికిలబడ్డాడు — గమ్యాన్ని చేరగలిగానన్న తృప్తితో...

చందమామ రావే...

జాబిల్లి రావే...

నీళ్ళు నిండిన కళ్ళతో నానీ ముఖంలోకి చూశాడు.

న్యూట్రీషియన్ ఫుడ్... పుష్టికరమైన ఆహా ర కావాలి నీకు... లేకపోతే నీ మేధ వికసించదు.

అలా వికసించక పోతే ఈ దేశం ఒక కలెక్టరునో, గవర్నరునో, గాంధినో, నెహ్రూనో పోగొట్టు కుంటుంది...

కాబట్టే నీకు న్యూట్రీషియన్ ఫుడ్ కావాలి...

చూడు నాన్నా... ఇది పవిత్ర భారతదేశం...

ఈ నేల ఉంది చూశావ్.

దీని కో గొప్ప చరిత్ర ఉంది.

ఈ మట్టిలోనే మహానుభావులు పుట్టారు.

మరెందరో కలిసిపోయారు.

అంతేకాదు... దీనిలో ఎన్నో ఖనిజాలు, సంపదలు ఉన్నాయి.

ఆఖరుకి మనం తాగే నీళ్ళు కూడా ఇందులోవే...

నిజాని కిది ఎవరి సొత్తూ కాదు... ఈ నేలపై పుట్టిన మనందరి దీని..

అయినా మనం అన్నింటినీ కొనాలి. కొంటే కాని మన కివేం అందుబాటులో ఉండవు.

కారణం. ఈ సంపదంతా మరెవరి సొత్తో కావడం.

కాబట్టే ప్రకృతి సంపదకూడా మనకు అంద కుండా పోతోంది.

సోషలిజమ్. అయ్యో భావి భారత పౌరుడివి. పసివాడివి నీ కివన్నీ ఇప్పుడు తెలియవులే.

నాన్నా. నానీ. నా బాబూ. ఇన లిదంతా ఎందుకు చెప్పుకొచ్చానూ.

ఆ. అదే.

న్యూట్రీషియన్ ఫుడ్.

పౌష్టికాహారం. . .

అదంతా పండేది ఈ నేలలోనే.

నిజం. నీకు తెలీదు కదూ.

అవునమ్మా. . .

ఈ మట్టి. ఈ నేల అంత సారవంతమైనది.

డాక్టరు నీకు అలాంటి పుష్టికరమైన ఆహార మివ్వమన్నాడు కదూ. అలా ఇవ్వలేని పేదవాడ్ననే కదూ నువ్వూ అలిగావు.

అవున్నాన్నా. నేను గుమాస్తాని. మహావృక్షాల మధ్య బతికే పిచ్చి మొక్కని. అన్నట్టు మన ముందున్న ఈ ప్రదేశా న్నేమంటారో తెలుసా. స్మశానం. సమసమాజానికి సంకేతం. కలిగిన వాడి కలలకి కూలి వాడికన్నీళ్ళకికూడా నెలవు.ఆశా నిరాశావాదుల ఆఖరి మజిలీ. అలసటతో ఆఖరి నిట్టూర్పు విడిచిన ప్రాణులను ప్రేమతో అక్కున చేర్చుకునే అమ్మఒడి.

బతక నేర్చిన వాడు. బతకలేని వాడు. కలవాడు లేనివాడు, మూర్ఖుడు ముని, యోగి, భోగి అన్న భేదంలేకుండా అందరి దేహాలను దాహంతో దాచుకున్న నేల కాబట్టే ఈ నేలలో న్యూట్రీషియన్ ఎలి మెంట్సు పుష్కలంగా ఉంటాయి.

అవు న్నాన్నా. . .

విడిగా నీకు పౌష్టికాహారం కొని ఇవ్వలేనివాణ్ని.

కొని నిన్ను కాపాడుకో లేనివాణ్ని.

కాబట్టే ఖరీదు పెట్టి కొనుక్కో నక్కరలేని నేలను నీ కిస్తున్నా. నేలపై నా కొడుగ్గా బతకని నువ్వు ఈ నేలలో నాలుగు కాలాల పాటు నిశ్చింతగా విశ్రాంతిని తీసుకుని ఈ నేలలోని సారాన్ని నీ ఒంటికి వంట పట్టించుకుని. న్యూట్రీషియన్ బేబీవై పుట్టి. చీకటిలో నిట్టూర్చే ఈ ప్రపంచాన్ని కాపాడే సిద్ధార్థుడివి కా.

అవున్నాన్నా. నాన్నా! నా వరాల కొండా.

ఈ అసమర్థుడి అంతిమ నివాళి అందుకో.

తవ్విన గోతిలో నానీ శవాన్నుంచుతూ పిచ్చివాడిలా తల బాదుకుంటున్న భాస్కరాన్ని చూసిన సమాధు లన్నీ ఆత్మ సాక్షాత్కారం సిద్ధించిన జ్ఞానుల్లా మౌనంగా ఉండిపోయాయి. ★